క్లుప్తంగా

చెన్నంపల్లిలో ముత్యాలమ్మ దేవర



కంబదూరు మండలం చెన్నంపల్లిలో దేవరకు హాజరైన తలారి రంగయ్య, ఉమా

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు మండలంలోని చెన్నంపల్లిలో ముత్యాలమ్మ దేవర మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు ఓబుళప్ప ఆహ్వానం మేరకు సమన్వయ కర్త తలారి రంగయ్య, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు హాజరై, అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి విందులో పాల్గొన్నారు.

పరామర్శ: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడును పార్టీ నేతలు తిప్పేస్వామి, మాదినేని ఉమామహేశ్వరనాయుడు మంగళవారం పరామర్శించారు. ఇటీవల తిమ్మరాయుడు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతురాయుడు, కౌన్సిలర్ లక్ష్మన్న, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడగట్ట నారాయణ, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తలారి సత్తి, నాయకులు భీమేష్, అండేపల్లి రమేష్, పాతలింగ, చరణ్, మంజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కౌలు రైతుల సదస్సు

విడపనకల్లు: ఉరవకొండ గవిమఠం వద్ద ఈనెల 22న జరిగే కౌలు రైతుల సదస్సుకు నియోజకవర్గంలోని కౌలు రైతులు తరలిరావాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి, జిల్లా నాయకులు బోయ వెంకటేశులు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని వేల్పుమడుగు, పెద్ద కొట్టాలపల్లి, ఆర్.కొట్టాల, పాల్తూరు, మాళాపురం తదితర గ్రామాల్లో పర్యటించారు. కౌలు రైతు సమస్యలపై ఈనెల 22న ఉరవకొండ గవిమఠంలో జరిగే సదస్సుకు రావాలని పోస్టర్లు అందించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ



ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శెట్టూరు: మండలంలోని చిన్నంపల్లికి చెందిన ముమ్మల శివశంకర్ గుండె పోటుతో మృతి చెందాడు. నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య , పార్టీ నేత ఉమా ఆదేశాల మేరకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు మృతుడి కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. శివశంకర్ దహన సంస్కారాల కోసం రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు.

జూదాలను అరికట్టండి

కుందుర్పి: మండలంలోని పలు గ్రామాల్లో జూదాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని ఎంపీపీ కమలమ్మ, వైస్ ఎంపీపీ భీమిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హనుంతరాయుడు, సర్పంచులు ఎస్ఐ నగేష్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. కుందుర్పి, జంబుగుంపల, మలయనూరు, ఎనుములదొడ్డి, నిజవల్లి, బసాపురం తదితర పంచాయతీల్లో యథేచ్ఛగా రాత్రింబవళ్లు పేకాట ఆడుతున్నారని, దీనితోడు రాత్రిళ్లు రైతుల పొలాల్లో విద్యుత్ పరికరాలు, బిందుసేద్యం పైపులు చోరీకి గురవుతున్నా స్పందన లేదన్నారు. దీనికి తోడు ఒక్కో గ్రామంలో 3,4 బెల్టు దుకాణాలు ఉండడంతో గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలుగుతోందన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణింపు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీదేవి

బొమ్మనహాళ్ / బెళుగుప్ప: సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని సీడీపీఓ శ్రీదేవి తెలిపారు. మంగళవారం కాలువపల్లిలో కిశోరి వికాసం వేసవి సెలవుల కార్యక్రమంలో భాగంగా లింగ వివక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ ఆడపిల్లల పట్ల వివక్ష చూపరాదన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ ఎల్లమ్మ, సూపర్‌వైజర్ అరుణ, ఎంఎస్‌కే పావని, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండురోజుల పాటు నీటి సరఫరా బంద్

రాయదుర్గంటౌన్: హెచ్చెల్సీ తాగునీటి పైప్ లైన్ లీకేజీ మరమ్మతులు చేస్తుండడంతో ఈనెల 21, 22 తేదీల్లో నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కణేకల్లు రోడ్డు ఆర్‌బీ వంక వద్ద పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు చేయనున్నట్లు చెప్పారు.

అప్రకటిత కోత.. అంధకారంతో అవస్థ

- చినుకు పడితే చాలు చిమ్మచీకటే
- సామర్థ్యం తగ్గిన ఇన్సులేటర్లతో సమస్య
- గాలి వీచిందా.. కుప్పకూలుతున్న విద్యుత్ స్తంభాలు
- చెట్లను తాకే తీగలతో సరఫరాకు అంతరాయం





ఈదురు గాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభం

రాయదుర్గం: వర్షాకాలం రానే వచ్చింది.. ఇటీవల భారీ వర్షాలు కురుస్తున్నాయి..దీంతో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. గాలి వీచిందా.. విద్యుత్ స్తంభాలు కుప్పకూలుతున్నాయి. దీనికితోడు సామర్థ్యం తగ్గిన ఇన్సులేటర్లతో విద్యుత్ సమస్య తలెత్తుతోంది. చిన్నపాటి గాలి వీచినా గంటల తరబడి సరఫరా ఆగిపోతోంది. చెట్లకు కరెంటు తీగలు తాకే చోట సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ఇక వీధిలైట్లు సరే.. కనీసం ఇళ్లలోనూ బల్బులు వెలగక ప్రజలు చిమ్మచీకట్లో గడపాల్సి వస్తోంది. వేసవి కావడంతో ఉక్కపోత భరించలేక, రాత్రిళ్లు కునుకు పట్టక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని 76,410 వ్యవసాయం, 1,81,364 గృహాలు, వాణిజ్యం, పరిశ్రమలకు చెందిన విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటన్నింటికీ 33/11 కేవీ నుంచి 59 సబ్‌స్టేషన్ల ద్వారా విద్యుత్ సరఫరా అవుతోంది. మండే వేసవిలోనూ ఈదురు గాలుతో కూడిన వడగండ్ల వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఎక్కడికక్కడ విద్యుత్ స్తంభాలు నేలకూలడం, వైర్లు తెగిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, ఫీడర్లు ట్రిప్పవడం, పిడుగుల శబ్దానికి ఇన్సులేటర్లు దెబ్బతినడం వంటి సమస్యలతో ప్రజలు గంటలకొద్దీ చీకట్లోనే మగ్గాల్సి వస్తోంది.

సామర్థ్యం తగ్గిన ఇన్సులేటర్లతో సమస్య...

విద్యుత్ సరఫరాలో అతి ముఖ్యమైన ఇన్సులేటర్లు (గాజు వాహకాలు) రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని చాలా గ్రామాల్లో దెబ్బతిన్నాయి. సామర్థ్యం తగ్గిపోవడంతో చినుకుపడితే చాలు నిప్పు రవ్వలు రాజుకుంటున్నాయి. ఈ సమయాల్లో దూర ప్రాంతాల్లో పిడుగులు పడినా, గాలి వీచినా, వర్షాలు కురిసినా దెబ్బతినే అవకాశం ఉంది. అవి ఏ ప్రాంతాల్లో పాడవుతాయో తెలియక రాత్రంతా జాగరణ చేయాల్సి వస్తోంది. వర్షాకాలం ఆరంభానికి ముందే వీటిని గుర్తించి కొత్తవి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తీగలు తాకే చెట్లను కత్తిరించి, సరఫరాకు ఇబ్బందుల్లేకుండా చూడాలి. వర్షాకాలంలో జరిగే విద్యుత్ ప్రమాదాలపై ప్రజల్ని అప్రమత్తం చేయాల్సి ఉంది.

సమస్య లేకుండా చూస్తాం

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నాం. అప్రకటిత కోతలు లేకుండా చూస్తున్నాం. ఈదురు గాలులు వీచిన సమయంలో స్తంభాలు నేలకొరగడం, పిడుగులు పడిన సందర్భాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, ఇన్సులేటర్లు ఎక్కడైనా దెబ్బతిన్నట్లయితే సరఫరాకు అంతరాయం కలుగుతోంది. సత్వరం పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నాం. వర్షాకాలం మొదలయ్యేలోపు విద్యుత్ లైన్లన్నీ పరిశీలించి, లోపాలు సరిచేయిస్తాం. విద్యుత్ తీగలకు చెట్లు తగలకుండా ప్రజలు చూసుకోవాలి. ఇబ్బందుల్లేకుండా సరఫరా జరిగేలా కృషి చేస్తాం.

– రాజశేఖర్, విద్యుత్‌శాఖ ఈఈ, కళ్యాణదుర్గం

కార్యకర్తలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న యువనేత మెట్టు విశ్వనాథ్‌రెడ్డి

బొమ్మనహాళ్: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా ఉండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ యువనేత మెట్టు విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఉంతకల్లు గ్రామంలో దేవమ్మ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చినప్పటి నుంచి అధికారం చేతిలో ఉందని వైఎస్సార్‌సీపీ నాయకులను వేధించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. కూటమి పాలకులు అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ముక్కన్న, నాయకులు డాక్టర్ బసప్ప, సూర్యప్రతాప్‌రెడ్డి, దేవరెడ్డి, పెద్దిరెడ్డి, హనుమంతరెడ్డి, నాగరాజు, ఈరన్న, ఓరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, తిమ్మారెడ్డి, సిద్ద, హోటల్ రవి, వెంకటేశులు, కర్రెగౌడ్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి



కళ్యాణదుర్గంలోని టీసర్కిల్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి టీసర్కిల్ వరకు సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్, జిల్లా అధ్యక్షురాలు నాగమణి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, మున్సిపల్ యూనియన్ నాయకులు, శ్రీరామరెడ్డి యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం తనిఖీ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని తహసీల్దార్ భాస్కర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆధార్ సేవల కోసం వచ్చిన ప్రజలతో మర్యాదగా మాట్లాడాలని నిర్వాహకుడికి సూచించారు. ఆధార్ కారుడ కోసం డబ్బులు వసూలు చేస్తే కేంద్రాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు.

రాయదుర్గంలో భారీ వర్షం



రాయదుర్గంలోని బళ్లారి రోడ్డు మదరసా వద్ద వర్షపునీటిలో వాహనదారుల ఇక్కట్లు

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం అరగంట కురిసిన వర్షం మళ్లీ సాయంత్రం 4 గంటలకు మరో అరగంట పాటు కురిసింది. దీంతో పట్టణంలోని డ్రైనేజీలు పొంగిపొర్లాయి. శాంతి కొండ ప్రాంతం నుంచి వర్షపునీటితో రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. కేబీ ప్యాలెస్ రోడ్డు, ఈ సేవా ఏరియా, కొలిమివీధి, రామస్వామివీధి, మధు టాకీస్ ఏరియాల్లో రోడ్లపై దాదాపు అడుగుమేర నీరు పారింది.

కణేకల్లులో మోస్తరు వర్షం

కణేకల్లు: మండలంలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. కణేకల్లు, కణేకల్లుక్రాస్, యర్రగుంట, మాల్యం, సొల్లాపురం తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. కణేకల్లు, నాగేపల్లి గ్రామాల్లో మంగళవారం కురిసిన వర్షానికి వరిధాన్యం తడిసిపోయింది. రెండురోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వరిధాన్యం తడిచి నష్టపోతున్నామని రైతులు అంటున్నారు. హనకనహాళ్, బెలుగుప్ప, రాంసాగర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో సొల్లాపురం వంకలో వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. ఓ వైపు వరి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఎత్తేయడం, మరోవైపు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ధాన్యం రాసులు పోసుకొని ఎదురుచూస్తున్నారు. అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

బెళుగుప్ప: మండలంలోని గంగవరం సమీపంలోని పేకాట స్థావరంపై ఎస్ఐ శివ, ఏఎస్ఐ రామదాసులు పోలీసులతో కలసి మంగళవారం దాడులు నిర్వహించారు. ఆరుగురు పేకాటరాయుళ్లు, ఆరు ద్విచక్ర వాహనాలతో పాటు రూ.23,200 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ముగిసిన పెన్నహోబిలం బ్రహ్మోత్సవాలు



ఆమిద్యాలకు ఊరేగింపుగా తరలివెళ్తున్న శ్రీవారి ఉత్సవమూర్తులు

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీవారి ఉత్సవమూర్తులు భారీ ఊరేగింపు నడుమ ఆమిద్యాల గ్రామానికి తరలివెళ్లాయి. ఉదయం స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనృసింహుడిని ప్రత్యేక పల్లకీలో కొలువు తీర్చి ఆమిద్యాలకు తరలించారు. ఆమిద్యాల గ్రామంలోని పెన్నోబుళేసుడి ఆలయంలో ఉత్సవమూర్తులను ప్రత్యేక పూజలు చేసి, అక్కడ కొలువుదీర్చారు. దీంతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ సాకేరమేష్ బాబు, అర్చకులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



పెన్నహోబిలం ఆలయ హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

ఉరవకొండ రూరల్: పెన్నహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయ హుండీ కానుకలు మంగళవారం లెక్కించారు. బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి పాండురంగారెడ్డి, దేవదాయ శాఖ పర్యవేక్షణ అధికారులు వన్నూరుస్వామి, కె.రాణి, ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు ఆధ్వర్యంలో కానుకలు లెక్కించారు. 13 రోజులకు గాను కానుకల రూపంలో రూ.15.85 లక్షలు, అన్నదానం హుండీ ద్వారా రూ.8,212 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ తెలిపారు. కార్యక్రమంలో గుంతకల్లుకు చెందిన హనుమాన్ సేవా సమితి, ఉరవకొండ షిర్డీ సాయి ఆలయం, అనంతపురం ఫస్ట్‌రోడ్డు శివాలయం సేవా సమితి వారు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటరమణుడి శయనోత్సవం



శ్రీవారి శయనోత్సవం

రాయదుర్గంటౌన్: స్థానిక కోటలో కొలువైన కలియుగ దైవం ప్రసన్న వేంకటరమణుడి వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు ముగిశాయి. చివరి రోజు మంగళవారం రాత్రి ఆలయంలో స్వామివారి శయనోత్సవం, సప్త ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో అర్చకుల ఆధ్వర్యంలో వేంకటరమణస్వామికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలు విజయవంతమైనందుకు ప్రజలు,కుల సంఘాలు, దాతలకు ఈఓ నరసింహారెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

నేటి నుంచి గోపుర కలశ ప్రతిష్ట పూజలు

బెళుగుప్ప: ఎర్రగుడిలో హనుమంతరాయస్వామి ఆలయంలో బుధవారం నుంచి హనుమజ్జయంతి వేడుకల్లో భాగంగా నూతన కలశ గోపుర ప్రతిష్ట పూజలు జరగనున్నాయి. ఇటీవల గ్రామంలోని హనుమంతుడి ఆలయంపై 14 అడుగుల హనుమంతుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం గంగపూజ, గోపూజ, కలశస్థాపన, జీవకళాన్యాస హోమాలు, మహాబలి, పూర్ణాహుతి, మంత్రపుష్పం పూజలు నిర్వహించనున్నారు. గురువారం ఆలయంలో పంచామృతాభిషేకాలు, మహాగణపతి పూజ, హనుమాన్‌చాలీసా పారాయణం, అష్టోత్తర శతనామావలి పూజలు అన్నదానం నిర్వహించనున్నారు. తగ్గుపర్తి, రమనేపల్లి, బూదిగుమ్మ, బెళుగుప్ప తదితర గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో వేడుకలు జరగనున్నాయి.

• చినుకు పడితే చిత్తడే



చిత్తడిగా మారిన శెట్టూరు ఎస్సీ కాలనీవీధి



నీటి కుంటను తలపిస్తున్న రోడ్డు

శెట్టూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని చినుకుపడితే చాలు చిత్తడిగా మారుతున్నాయి. కాలనీవాసులు ఇళ్లలోనుంచి వీధుల్లోకి అడుగు పెట్టాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రోజుల తరబడి రోడ్లపై వర్షపు నీరు, మురుగు నీరు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి.

ఆఫీసుకెళ్లాలంటే బురద దాటాల్సిందే!



రాయదుర్గంలో ప్రభుత్వ కార్యాలయాల ఎదుట బురదగుంటలా మారిన దృశ్యం

రాయదుర్గంటౌన్: వర్షం వచ్చిందంటే చాలు.. పట్టణంలోని మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మంగళవారం పట్టణంలో కురిసిన భారీ వర్షానికి తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయ గేటు ముందు వర్షపునీరు నిలిచి బురద గుంటగా మారింది. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో భారీగా వర్షపునీరు నిలిచింది. నడిచేందుకు మార్గంలేక ప్రజలు, ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

సాక్షి ఎఫెక్ట్..



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ నాగేశ్వరరావు

బొమ్మనహాళ్: సచివాలయ ఉద్యోగులు విధిగా సమయపాలన పాటించాలని డీఎల్‌డీఓ నాగేశ్వరరావు ఆదేశించారు. ఈనెల 15న 'ఉద్యోగులు ఉన్నట్టా..లేనట్టా ?' శీర్షికన ప్రచురితమైంది. స్పందించిన డీఎల్‌డీఓ మంగళవారం మండలంలోని దేవగిరి, ఉంతకల్లు గ్రామాల్లోని సచివాలయాలను తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం కల్లుదేవనహళ్లి గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్‌డీ దాస్, సర్పంచ్ ముక్కన్న, పంచాయతీ కార్యదర్శి పల్లవి, సచివాలయ సబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి పంచాయతీలకు అదనపు ఆదాయం

బొమ్మనహాళ్: చెత్త నుంచి సంపద సృష్టిస్తే గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని డీఎల్‌డీఓ నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం మండలంలోని ఉంతకల్లులోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్‌డీ దాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ మాట్లాడుతూ గ్రామస్థాయిలో పూర్తిగా చెత్త సేకరణ చేయాలన్నారు. గ్రామస్తులు రోజూ సేకరించిన తడి పోడి చెత్తతో పాటు ప్రమాదకర చెత్తను వేర్వేరుగా విభజించి, చెత్త సేకరించే సిబ్బందికి అందించాలన్నారు. ఇలా సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించి వానపాములు ఎరువుల తయారీ, రీసైక్లింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముక్కన్న, పంచాయతీ కార్యదర్శి పల్లవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సార్.. ఉపాధి పనులు కల్పించండి

కణేకల్లు: సార్... మా ఊరిలో ఉపాధి పనులు కల్పించండి అంటూ రచ్చుమర్రి గ్రామస్తులు ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులును కోరారు. రచ్చుమర్రి గ్రామ ఉపాధి కూలీలు మంగళవారం ఎంపీడీఓను కలిసి విన్నవించారు. కూలీలు మాట్లాడుతూ ఉపాధి పనులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు అధికంగా ఉన్నాయన్నారు. ఎంపీడీఓ స్పందిస్తూ ఫీల్డ్ అసిస్టెంట్ సమస్యతో పనులు కల్పించడంలో జాప్యం జరుగుతోందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ రాజీనామా చేయడంతో పనులు ఆపేయాల్సి వచ్చిందని, త్వరలో కొత్త ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమిస్తామన్నారు. ఈలోపు టెక్నికల్ అసిస్టెంట్, సీనియర్ మేట్ పర్యవేక్షణలో పనులు జరుగుతాయన్నారు.

క్షయ స్క్రీనింగ్ టెస్టులపై నిర్లక్ష్యం సరికాదు

కూడేరు: ప్రజలు క్షయ వ్యాధిపై భయాందోళన అవసరంలేదని, స్క్రీనింగ్ టెస్టులపై నిర్లక్ష్యం సరికాదని వైద్యాధికారిణి ఉషారాణి అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో 'వంద రోజుల క్షయ స్పెషల్ డ్రైవ్' పై ఏఎన్ఎంలు, ఆశావర్కర్లకు శిక్షణ ఇచ్చారు. వైద్యాధికారిణి ఉషారాణి మాట్లాడారు. ఆరు నెలలు పాటు మందులు సక్రమంగా వాడితే క్షయ వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. మందులు వాడినా 14 రోజులకు మించి దగ్గు ఉంటే క్షయ వ్యాధి కావచ్చన్నారు. షుగర్ వ్యాధిగ్రస్తులు, మాస్ ఏరియా, వలస వచ్చిన ప్రజలు ఉండే ప్రాంతాల్లో పక్కాగా క్షయ స్క్రీనింగ్ టెస్టులు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సరోజ, సూపర్ వైజర్లు యశోద, రవీంద్ర, క్షయ సూపర్ వైజర్ బాషా, హెల్త్ అసిస్టెంట్లు రమేష్, మురళి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

కుందుర్పి: జంబుగుంపలలో కుసుమగిరి రైతు సంఘం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సీఈఓ నరసింహామూర్తి ఆధ్వర్యంలో 14 మంది మహిళలకు మంగళవారం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మరో 12 గ్రామాల్లో ఉచిత కుట్టు శిక్షణ కొనసాగుతోందన్నారు.

తడిపొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించాలి

రాయదుర్గం టౌన్: పట్టణంలోని వార్డుల్లో తడి పొడి చెత్త సేకరణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయంలో ఉంచిన కొత్త పుష్‌కార్ట్‌లు, తడిపొడి చెత్త సేకరణ బుట్టలను పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, సునార్ ఇస్మాయిల్, రామాంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర యాదవ్, మేస్త్రీలు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో నీటి ఎద్దడి



సూగేపల్లి వద్ద నీటి కోసం గుమిగూడిన జనం

బ్రహ్మసముద్రం: విద్యుత్ కోతలతో మండలంలోని పలు గ్రామాల్లో నీటి సమస్య తలెత్తింది. మండలంలోని సంతేకొండాపురం, సూగేపల్లి, కోనాపురం తదితర గ్రామాల్లో నీటి సమస్య తలెత్తింది. గ్రామస్తులు బిందెలు పెట్టుకుని గంటల తరబడి కొళాయిల వద్ద ఎదురుచూడాల్సి వస్తోంది.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు నివాళి



మారెప్ప మృతదేహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

బ్రహ్మసముద్రం : మండలంలోని పిల్లలపల్లికి చెందిన బోయ మారెప్ప అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం పిల్లలపల్లికి వెళ్లి మారెప్ప మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సర్పంచు తలారి గోవిందప్ప, మాజీ సర్పంచ్ వడ్డే వెంకటేశులు, మాజీ డీలర్ తిమ్మరాయుడు, స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జిందాల్ కర్మాగారం లారీ వెలికితీత

బొమ్మనహాళ్: మండలంలోని కురువల్లి రోడ్డులో జిందాల్ కర్మాగారానికి వెళ్తున్న లారీ ఆదివారం రాత్రి అదుపుతప్పి పడిపోయింది. మంగళవారం ఉదయం క్రేన్ల సహాయంతో లారీని బయటకు తీశారు. రోడ్డు గుంతలుగా ఉండడంతోనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు.